

'మత్తు'లో యువత



నియంత్రణలోకి రాని గంజాయి భూతం

- విద్యార్థులు, మైనర్లకు పోలీసుల కౌన్సెలింగ్
- ఏడాదిలో 128 కిలోల గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో గంజాయి భూతం జడలు విప్పుతున్నది కొందరు యువకులు, విద్యార్థులు మద్యంతో పాటు గంజాయి, ఇతర డ్రగ్స్ మత్తులో జోగుతున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యంవైపు సాగుతూ, చదువుపై దృష్టిని సారించాల్సిన యువకులు, విద్యార్థులు తప్పటడుగులు వేస్తూ వారి జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. గంజాయిని సేవించడం సరదాగా అలవాటు చేసుకుని మత్తులో కూరుకుపోతున్నారు. గంజాయి మత్తుకు క్రమక్రమంగా అలవాటు పడిన విద్యార్థులు, యువకులు మాఫియా వలలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. ఒక్కసారి గంజాయి మత్తుకు అలవాటుపడి అందులో నుంచి బయటపడలేక కొందరు ఏజెంట్లుగా మారుతున్నారు. గంజాయికి డబ్బులు లేక దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు పెద్దఎత్తున కమీషన్లు రావడం, ఉచితంగా గంజాయి లభించడంతో స్మగ్లర్లుగా మారుతున్నారు.



39 కేసుల్లో 85 మంది అరెస్టు

2024 సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 128 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 39 కేసుల్లో 85 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వందమంది వరకు బాలురికి వారి తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, హెచ్చరించి వదిలిపెట్టారు.

పలు కారణాలతో బానిసలు

ఒత్తిడి నుంచి బయటపడేందుకు గంజాయి మత్తుకు కొందరు దాసోహం అవుతుండగా ఫేస్ గ్లో పెరుగుతుందనే అపోహతో మరి కొందరు గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. కరీంనగర్‌లో గంజాయి, ఇతర డ్రగ్స్ వినియోగం ఎక్కువైనట్లు జిల్లాలో జరిగిన సంఘటనల ద్వారా వెల్లడవుతున్నది. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసగా మారుతున్నట్లు టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసు అధికారులు చేసిన సోదాల్లో బయటపడింది. జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, రేకుర్తి ప్రాంతాల్లో గంజాయి విక్రయించే పలువురిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. మద్యం మత్తులో ఇప్పటికే మునిగి తేలుతున్న యువత క్రమేపీ గంజాయి, కొకైన్, తదితర మత్తు పదార్థాలను వినియోగిస్తూ కొత్త మత్తుకు అలవాటు

మిగతా 8వ పేజీలో...

శివారు ప్రాంతాల్లో అడ్డాలు

కరీంనగర్ శివారులోని ఇంజనీరింగ్ కళాశాలలు, నిర్జనప్రదేశాల్లో అడ్డాలు ఏర్పాటు చేసుకుని గంజాయిని సిగరెట్‌లలో వినియోగిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 50 గ్రాముల గంజాయిని 250 నుంచి 300 రూపాయలకు వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఆకును సిగరెట్లలో నింపుకుని తాగడంతో పాటు హుక్కా ద్వారా వినియోగిస్తున్నారు. కొంతకాలం కిందట రెండు గ్రాముల కొకైన్‌తో ముగ్గురు విద్యార్థులు కరంనగర్ శివారులోని రాంనగర్‌లో వాహనాల తనిఖీల్లో పోలీసులకు చిక్కారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో హైదరాబాద్‌కు చెందిన సినీపరిశ్రమకు చెందిన ద్వితీయశ్రేణి నటులు డ్రగ్స్‌తో పట్టుబడ్డారు. డబ్బున్న యువకులు, విద్యార్థులు గంజాయి, కొకెయిన్, తదితర మత్తు పదార్థాలను వినియోగిస్తుంటే మధ్య తరగతి, పేదవర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం అల్ప్రోజోలాం, క్లోరల్ హైడ్రేట్, వైటనర్ లిక్విడ్, దగ్గు మందులను, మత్తునిచ్చే ఇతర ఇంజక్షన్లను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్‌లోని కొన్ని పాన్‌షాపుల్లో గంజాయి, ఇతర మత్తుమందు చాక్లెట్స్ అమ్ముతున్నట్లు సమాచారం. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాల్సి అవసరమున్నది. వసతిగృహాలు, అద్దెగదుల్లో ఉంటున్న విద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకుని గంజాయి మాఫియా తమ వ్యాపారాన్ని విస్తరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్‌రూం, బ్యాలట్ బాక్స్‌ల నిర్వహణ తదితర ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం పరిశీలించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు కోసం రెవెన్యూ అధికా రులకు పలు సూచనలు చేశారు. బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటుపై పోలీసు అధికారులతో చర్చించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం బ్యాలెట్ బాక్సులు ఉపయోగించనున్న నేప థ్యంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లోని స్ట్రాంగ్‌రూంలో భద్ర పరిచిన బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ బాక్స్‌లకు ఆయిల్ లూబ్రికేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు మహేశ్వర్, రమేష్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

అధికారుల సెలవు దరఖాస్తుకు ప్రత్యేక పోర్టల్



సెలవుల పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్: వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు సెలవు దరఖాస్తు, మంజూరును ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. టీం ఇండియా సంస్థ సీఈవో చైతన్య ఆధ్వర్యంలో ఈ లీవ్ మేనేజిమెంట్ పోర్టల్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పేపర్ వర్క్ తగ్గించేందుకు, సెలవు మంజూరులో పారదర్శకత కోసం ఈ పోర్టల్ రూపొందించామన్నారు. అధికారులు, ఉద్యోగులు సెలవు కోసం ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే జిల్లా యంత్రాంగం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి, లక్ష్మిప్రసన్న, అనిల్‌శర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి

నిధులు కేటాయించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలకు ప్రత్యేక నిధులు కేటాయిచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. మంగళవారం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నా రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను నియంత్రించడంలో విఫలమయ్యిందన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఐదు లక్షల విద్య భరోసా కార్డు, విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు వంటి హామీల అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల చేయకపోవడంతో విద్యార్థులతోపాటు కళాశాలల యాజమాన్యాలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రావణ్, వినయ్, అజయ్, అశోక్, రాజేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ రూప్‌సింగ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పుమేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ రూప్‌సింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీతం 26 వేల రూపాయలకు పెంచాలన్నారు. కార్మికులపై జవాన్ల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మార్చిలో నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమవేశంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు దావు రాజమల్లయ్య, నగర అధ్యక్షుడు గడ్డం సంపత్, శానిటేషన్ వెహికిల్ యూనియన్ అధ్యక్షుడు పొన్నం లింగయ్య, కత్తెరపాక రాజేందర్ పాల్గొన్నారు.

జమ్మికుంట ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం

జమ్మికుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్సీ) కేంద్ర బృందం మంగళవారం సందర్శించింది. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, స్పెషలిస్టులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది మొత్తం ఎంత మంది పని చేస్తున్నారని అడిగారు. ఆసుపత్రి పరిసరాలు, టాయిలెట్స్ పరిశీలించారు. ప్రతి నెల జరుగుతున్న ప్రసవాల గురించి వివరాలు అడిగారు. బీపి, షుగర్, క్యాన్సర్ రోగులకు తప్పనిసరి గా వైద్య సేవలు అందించాలని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఆర్సీ బృందం సభ్యులు డాక్టర్ వి శ్రావణ్‌కుమార్, డీపీవో టి స్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని

రైతుల ఆందోళన

గన్నేరువరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని డీ8 ఉపకాలువను మరమ్మతులు చేసి పొలాలకు సాగునీటిని అందించాలని కోరుతూ మైలారం రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయన్నారు. ఈ మొక్కలు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయన్నారు. సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నీటి పారుదల అధికారులు స్పందించి కాలువకు మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విలాసాగరం రామచంద్రం, సింగిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, వీరవేని తిరుపతి, కొంకటి రవి, కనవేని బాలయ్య, జీల లచ్చయ్య, నూకల ఎల్లయ్య, గంగిపల్లి కనుకయ్య వరాల అనిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో బీఆర్ఎస్ లేనట్లే..



- పార్టీలో ప్రసన్న హరికృష్ణ చేరికకు బ్రేక్..
- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని అధినేత కేసీఆర్

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉండడంపై బీఆర్ఎస్ స్పష్టత ఇవ్వడం లేదు. ఇన్నాళ్లు స్తబ్దంగా ఉన్న ఆ పార్టీలో మూడు రోజుల క్రితం కదలిక వచ్చింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని ఆశించిన ప్రసన్న హరికృష్ణ ఆ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. పార్టీలో చేరి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగుతానని బీఆర్ఎస్ అగ్రనేతలను కలిశారు. ఓ దశలో ఆయన అభ్యర్థిత్వం ఖరారైందని ప్రచారం జరిగింది. అధినేత కేసీఆర్ ఒప్పుకోకపోవడంతో ఈ ప్రచారానికి తెరపడింది. పార్టీ ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా ఎన్నికల్లో పోటీ చేస్తానని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అంటున్నారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత సర్దార్ రవీందర్‌సింగ్‌కు అండగా ఉందామంటూ పార్టీ శ్రేణులకు చెప్పడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7





ఎస్ఐ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వెంటాడిన 'విధి'

- విధి నిర్వహణకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం
- మహిళా ఎస్ఐ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతి

6

రెండో రోజు మూడు నామినేషన్లు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి

7

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


- ఆలయ మాడ వీధుల్లో శేషవాహనంపై శ్రీవారి విహారం
- నేడు అగ్నిప్రతిష్ఠ, సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు

నేటి కార్యక్రమాలు..
బుధవారం ఉదయం 8 గంటల నుంచి గో పూజ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం ఉంటుంది. 9 నుంచి సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి భేరీ పూజ, చంద్రప్రభ వాహన సేవ ఉంటుంది.



పాతబజార్ గౌరీశంకరాలయంలో పుట్టమట్టికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంకురార్పణ జరిగింది. తొలిరోజుతోపాటు రథసప్తమి కావడంతో ఆల యంలో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం పాతబజార్ గౌరీశంకరాలయం నుంచి పుట్టమన్ను తెచ్చారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం జరిగాయి. రాత్రి శ్రీవారు శేషవాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ పాల్గొన్నారు. సాంస్కృతిక కళావేదికపై పలు మండళ్ల ఆధ్వర్యంలో భజనలు నిర్వహించి కీర్తనలు ఆలాపించారు. దుర్గామైత్రేయి వీణా వాయిద్యం, కళాక్షేత్ర నాట్య మండలి వి స్వప్నకుమారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం, వంగల సురేంద్రాచారి శిష్య బృందం భరతనాట్యం, మిర్యాల ఆనంద్, రాజశేఖర్, ప్రసన్న, మధులచే మోహిని భస్మాసుర కళారూపం, కిట్ల చరణ్ వేణుగానం, వావిలాల నాగరాణి భాగవతారిణి హరికథ అలరించాయి.



మాడ వీధుల్లో శేషవాహన సేవ

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గత నెలలో కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి బంగారం, వెండి, నగదును దొంగిలించుకుపోయిన కేసులో ఇద్దరు నిందితులను కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ బిల్ల కోటేశ్వర్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. కరీంనగర్ అశోక్‌నగర్‌లో జనవరి 25న తాళం వేసిన ఇంటిలో హన్మకొండకు చెందిన బంగారి నరేష్‌కుమార్, ఎండీ ఆసిఫ్ పాషా చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. మంగళవారం తీగలవంతెన వద్ద తనిఖీల్లో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 3 తులాల బంగారం, 20 తులాల వెండి, లక్షా 25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

కోనరావుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శివంగాలపల్లి గ్రామానికి చెందిన ఆముద రాజు గ్రామంలోని కుమ్మరిగుట్ట సమీపంలో సర్వే నంబరు 17లో వాల్టా చట్టానికి విరుద్ధంగా ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మట్టిని తీసి చదును చేస్తుండగా తహసీల్దార్ విజయప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చదునుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్, ఇతర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

విధులను ఆటంకపరిచిన చిరు వ్యాపారిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూనియర్ అసిస్టెంట్ బండారి లక్ష్మణ్ విధులను ఆటంకపరిచిన తమలపాకుల వ్యాపారి అన్వర్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం గంజ్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి సామగ్రి తొలగిస్తుండగా అన్వర్‌ఖాన్ ప్లాస్టిక్ బాటిల్‌లో ఉన్న గుర్తుతెలియని ద్రావణాన్ని పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ తనవిధులను ఆటంకపరిచాడని లక్ష్మన్ ఫిర్యాదు చేశాడు.

రేషన్ బియ్యం పట్టివేత



తనిఖీలు చేస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బైపాస్ రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం సివిల్ సప్లయిస్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గ్రామ శివారులో సాయికుమార్ అనే వ్యక్తి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరించి బైపాస్‌లోనని ఒక గదిలో నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు దాడి చేసి 63 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు. గంగాధర సివిల్ సప్లయిస్ డీటీ ఉషా, ఎఫ్ఐ అన్వర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని రేణుకా ఎల్లమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎల్లమ్మగుడి తలుపుల తాళలను పగలగొట్టి విగ్ర హం పైఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన గౌడ సంఘానికి చెందిన వారు తలుపులు పగలగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పుస్తెలతాడుతో పాటు, చిల్లర డబ్బులను దొంగిలించినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు కొయ్యడ సంపత్ గౌడ్, డైరెక్టర్ న్యాలం కనకయ్య గౌడ్, న్యాలం వీరయ్య గౌడ్, బుర్ర హరీష్ గౌడ కొయ్యడ మారుతీ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంటాడిన 'విధి'

విధి నిర్వహణకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం

మహిళా ఎస్ఐ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతి



వారిద్దరు విధి నిర్వహణకు తమ తమ ఇళ్ల నుంచి హుషారుగా బయలుదేరారు. వారిని 'విధి' వెంటాడింది. మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరినీ బలిగొంది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30), ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. శ్వేత నడుపుతున్న కారు ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న నరేష్‌ను బలంగా ఢీకొంది. అనంతరం అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొంది. దీంతో శ్వేత, నరేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు.



మృతి చెందిన ఎస్సై శ్వేత, నరేష్ (ఫైల్)

జగిత్యాల క్రైం/గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30)తో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. ఇన్‌చార్జి ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల డీసీఆర్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొక్కుల శ్వేత కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి తన కారులో జగిత్యాల వస్తోంది.

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మల్యాల నరేష్ విధుల నిమిత్తం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు ద్విచక్ర వాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులోని వంతెన సమీపంలో శ్వేత కారు ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అదే వేగంతో కారు చెట్టుకు ఢీకొనడంతో ఎస్సై శ్వేత అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనంపై ఉన్న నరేష్ రోడ్డు ప్రక్కన పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

● సీట్ బెల్ట్ పెట్టుకుని ఉంటే..

ఎస్ఐ శ్వేత సీట్ బెల్ట్ ధరించి ఉంటే కారుకు ఉన్న ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకుని ప్రమాదం నుంచి ఎస్సై బయట పడే అవకాశం ఉండేది. ఎస్సై శ్వేత కారును అదుపు చేయలేక పోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఎస్పీ అశోక్ కుమార్‌తో పాటు డీఎస్పీ రఘుచందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహాలను అప్పగించారు. నరేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది.



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

పోలీస్ శాఖలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ శ్వేత మృతి చెందడంతో జిల్లా పోలీస్ శాఖలో విషాదం నింపింది. నిన్నటి దాకా తమతో విధులు నిర్వహించిన ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు పోలీస్ అధికారులు కంటతడి పెట్టారు. శ్వేత జిల్లాలోని వెల్గటూర్, కథలాపూర్, కోరుట్ల, పెగడపల్లి మండలాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్సై శ్వేత కుటుంబ సభ్యులను ఎస్పీ పరామర్శించారు.

నరేశ్ స్వగ్రామం ముత్యంపేటలో విషాదం

మల్యాల: నరేశ్ మృతితో మల్యాల మండలం ముత్యంపేటలో విషాదం నెలకొంది. నిరుపేద వ్యవసాయ కూలీలైన మల్యాల నర్సయ్య-లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన నరేశ్ గతంలో లక్సెట్టిపేటకు రోజూ బస్సులో వెళ్లేవాడు. 15 రోజులుగా ద్విచక్ర వాహనంపై చిల్వకోడూర్ మీదుగా లక్సెట్టిపేట వెళ్తున్నాడు. గతంలో మాదిరిగా జగిత్యాల నుంచి బస్‌లో వెళ్లినా బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ముత్యంపేటకు తీసుకువచ్చారు. మృతుడి సోదరుడు దుబాయి నుంచి మంగళవారం బయల్దేరడంతో అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నారు.

కష్టపడి చదివి.. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఎదిగి..

ఇంటి నుంచి బయల్దేరిన గంటకే మృతి

చొప్పదండి: పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని పైకి వచ్చిందుకున్న తరుణంలో రోడ్డు ప్రమాదం ఆమెను బలిగొనడం ఆర్నకొండ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఉదయం హుషారుగా ఇంటి నుంచి బయలుదేరిన గంటకే మరణవార్త విన్న తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చొప్పదండి మం డలం ఆర్నకొండకు చెందిన కొక్కుల శ్వేత గొల్లపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆర్నకొండకు చెందిన లక్ష్మీనారాయణ- సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె శ్వేత. వీరిలో శ్వేత పెద్దది. పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. 2016లో డిగ్రీ పూర్తి చేసిన శ్వేత పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. కష్టపడి చదివి పెద్ద ఉద్యోగం సాధించాలనే తపనతో 2019లో ఎస్ఐ ఉద్యోగాన్ని శ్వేత సాధించింది. మండలం నుంచి మహిళా ఎస్ఐగా ఎంపికై పలువురు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. జగిత్యాల జిల్లాలో ఎస్ఐగా సేవలందించింది. తమ కూతురికి ఉన్నత ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు, సోదరులు ఎంతో సంతోషపడ్డారు. చిన్న కుటుంబం నుంచి పట్టుదలతో చదివిపైకి వచ్చిన శ్వేత రోడ్డు ప్రమాదంలో మరణించడం గ్రామస్థులను తీవ్రంగా కలచి వేసింది. ఉదయం ఇంటి నుంచి శ్వేత కారులో వెళ్లి సాయంత్రానికి శవమై తిరిగి రావడంతో గ్రామస్థులను కంటతడి పెట్టించింది. పోలీసు శాఖలో చిన్న వయస్సులోనే ఎస్ఐ ఉద్యోగం రాగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందని మురిసిపోతున్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు...

ఆర్నకొండలో శ్వేత అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి లక్ష్మీనారాయణ అంత్యక్రియలను నిర్వహించగా పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. మండలం నుంచి పలువురు నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో అంత్యక్రియలకు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడి మృతి

మస్తాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్రాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. మోర్రాపూర్ గ్రామానికి చెందిన భూక్య రాంచరణ్(16) అనే యువకుడు తన స్నేహితులు బట్టు చందు, వరుణ్ కృష్ణలతో కలిసి గ్రామంలోని చెరువును చూసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు రాంచరణ్ కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. మృతుడి తండ్రి రవీందర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మృతుడు ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్నాడు.

వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నల్లగాశే చిన్నరాజయ్య (60) అనే వృద్ధుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ లక్ష్మినారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఊటూర్‌కు చెందిన చిన్నరాజయ్యకు కళ్లు సరిగా కనిపించకపోవడమే కాకుండా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి పశువుల పాకలో పడుకొని మంగళవారం తెల్లవారే సరికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ వెరిఫికేషన్ కోసం తప్పుడు అఫిడవిట్ సమర్పించిన గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన నర్సింగోజు రాజేష్ కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. తమపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ చూపించి వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఎస్‌బీ విచారణలో ఒక క్రిమినల్ కేసు ఉన్నట్టు తేలింది. దీంతో దరఖాస్తుదారుడిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్‌బీ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు సూచించడంతో మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిహరకాలనీకి చెందిన పోడపత్రం ధర్మపురి(45) అనే గల్ఫ్ ఏజెంట్‌ను మంగళవారం అరెస్ట్‌చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలకు చెందిన పడిగే శంకర్, పడిగే రమేశ్, కాలువ నవీన్‌లు నకిలీ గల్ఫ్ ఏజెంట్ అయిన ధర్మపురిని నమ్మి ఒక్కొక్కరు రూ.95వేల చొప్పున అతనికి ఇచ్చి కంపెనీ విసా అని చెప్పి నమ్మించి మాల్దీవ్స్ దేశానికి పంపారన్నారు. మాల్దీవ్స్‌లో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులు చేయిస్తూ సరైన భోజనం, అకామిడేషన్ ఇవ్వకుండా ఇబ్బంది పడి అనారోగ్యానికి గురై మోసపోయినట్లు వారి కుటుంబ సభ్యులకు తెలుపడంతో స్థానిక మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ ద్వారా పడిగే రజిత ఫిర్యాదు మేరకు ఏజెంట్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉపాధికోసం వెళ్లే యువకులు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పాత వాడకు చెందిన మంద కిషన్ అనే గీత కార్మికుడు సోమవారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. సుగ్లాంపల్లిలోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో పక్క ఎముకలు, తొంటి విరిగింది. ప్రస్తుతం అతను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కిషన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సారయ్య గౌడ్ తదితరులు పరామర్శించారు.

అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం



తిరుపతి (ఫైల్)

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు చొప్పరి తిరుపతి (46) అప్పుల బాధతో ఇంటి ఆవరణలో ఉరేసుకుని మంగళవారం తెల్లవారుజామున బలవన్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేద కుటుంబానికి చెందిన తిరుపతి కొన్నేళ్ల క్రితం అప్పు చేసి గల్ఫ్ దేశం వెళ్లాడు. కానీ అక్కడ చాలీచాలని వేతనంతో అప్పులు తడిసిమోపెడయ్యాయి. సుమారు 16 సంవత్సరాలు దుబాయ్ దేశం వెళ్లినా అప్పులు తీరలేదు. దీంతో నాలుగు నెలల క్రితం ఇంటికి తిరిగివచ్చాడు. అనంతరం మూడు నెలల క్రితం దోహా ఖతర్ దేశం వెళ్లగా అక్కడ పక్షవాతం రావడంతో కంపెనీ యాజమాన్యం పదిహేను రోజులకే ఇంటికి తిప్పి పంపింది. దీంతో గతంలో ఉన్న అప్పులకు తోడు చికిత్స కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో మంగళవారం కోతుల దాడిలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామానికి చెందిన తిప్పని మల్లేష్ స్థానిక ఇండియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేయడానికి వెళ్లగా అక్కడే ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి.

గమనించిన గ్రామస్థులు కర్రలతో కోతులను బెదిరించగా అవి పారిపోయాయని తెలిపారు. గాయపడిన మల్లేష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా నిర్వాహకులు బైండోవర్

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొల్లి సమ్మవ్వ, పెద్ద రాతుపల్లి గ్రామానికి చెందిన పూదరి సదయ్య గతంలో గుడుంబా అమ్ముతూ బైండోవర్ అయ్యారు. బైండో వర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా అమ్ముతుండడంతో మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై మాట్లాడు తూ గుడుంబా అమ్మిన, తయారు చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రయోగాలు చేసేదెలా సారూ..

● శిథిలావస్థలో జూనియర్ కళాశాల ల్యాబ్ గదులు

● భయం నీడలో విద్యార్థులు..



సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేక అధ్యాపకులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 532 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థలకు చేరుకున్నాయి. ఆయా గదుల్లో ప్రయోగాలను చేసేందుకు విద్యార్థులు జంకుతున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్‌కు సంబంధించిన పరికరాలతోపాటు ఈవీఎంలను పోలింగ్ అధికారులు భద్ర పర్చారు. 1969లో కళాశాలలో నిర్మించిన గదుల కు ఏర్పాటు చేసిన సిమెంట్ రేకులు పగిలి పోవడంతోపాటు గోడలు సైతం వర్షాలకు తడిసి కూలి పోయిన వాటిల్లోనే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో కళా శాలలో చదు వుతున్న 532 మంది విద్యార్థులు తమకు సంబంధించిన ల్యాబ్ ప్రయోగాలను చేసేందుకు పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియక భయం నీడలో ప్రయోగాలు చేస్తున్నారు.

పోలింగ్ సామగ్రితో పాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గదుల ను ఖాళీ చేయాలని కళాశాల ప్రిన్సిపల్ పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలను అందించినా ఎలాంటి ఫలితం లేక పోవడంతో శిథిలావస్థకు చేరిన గదులల్లోనే ల్యాబ్‌లను కొన సాగి స్తున్నారు. కలెక్టర్ స్పందించి కళాశాలలో శిథిలావస్థకు చేరిన గదులను పరిశీలించి పోలింగ్ సామగ్రితో పాటు ఈవీ ఎంలు భద్రపరిచిన గదులను ఖాళీచేసి కళాశాలకు అందించాలని అధ్యాపకులతోపాటు విద్యార్థులు కోరుతున్నారు.



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శిథిలావస్థకు చేరిన ల్యాబ్ గదులు

ఎప్పుడు కూలుతుందో తెలియదు

అక్షయ, ఇంటర్ సెకండియర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. ఆయా గదుల్లో ఏర్పాటుచేసిన ల్యాబ్‌లలో ప్రయోగాలు చేయాలంటే భయం వేస్తోంది. నూతన గదుల్లో పోలింగ్ సామగ్రితో పాటు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. వాటిని ఖాళీ చేయాలి.

ప్రయోగాలు చేయాలంటేనే భయం..

అల్తాఫ్, ఇంటర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో ప్రయోగాలు చేయాలంటేనే భయంతో వణికిపోతున్నాం. కళాశాలలో సరైన గదులు లేకపోవడంతో అందులోనే ప్రయోగాలను చేసేందుకు ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వాటిని మార్పు చేయాలి.

పోలింగ్ సామగ్రిని తరలించాలి..

కనకశ్రీ విజయరఘునందన్, కళాశాల ప్రిన్సిపాల్



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1969లో నిర్మించిన రేకుల షెడ్లలోనే ప్రస్తుతం ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. గదులు శిథిలావస్థకు చేరడంతో ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్ సామగ్రిని ఖాళీచేయాలని కలెక్టర్‌కు పలుమార్లు వినతి పత్రాలను అందించిన ప్రయోజనం లేకుండా పోయింది. కలెక్టర్ స్పందించి గదులను ఖాళీ చేయిస్తే ల్యాబ్‌లను అందులోకి మార్చుస్తాం.



ఈ భవంతికి 84 ఏళ్లు..

నాటి పనితనానికి అద్దం పడుతున్న వైనం

రాచర్ల తిమ్మాపూర్‌లో ఆకట్టుకుంటున్న రెండంతస్తుల భవంతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దంగు సున్నం.. టేకు కల ప.. విశాలమైన స్థలంలో నిర్మించిన భవనం 84 ఏళ్లగా చెక్కుచెదరకుం డా అప్పటి కూలీల పని తీరుకు అద్దం పడుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలోని రామగిరి మారుతిరావు ఇళ్లు ఆకట్టుకుంటోంది. రెండంతస్థుల భవనంలో విశాలమైన గదులు, విశ్రాం త గది, రెండు బెడ్ రూంలు, వంట గది, పూజ గదులతో పాటు మొత్తం 18 గదులున్నాయి. ఇప్పటికీ చెక్కుచెదరకుండా భవంతి కనిపిస్తోంది.

బ్రిటీష్ కాలంలో నిర్మాణం

మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన రామగిరి మారుతిరావు తాత నర్సింగారావు 1941లో సుమారు రూ.50వేలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి దంగు సున్నం వినియోగించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. రెండంతస్థుల భవనం ముందు కమాన్, ఇంటిలోకి వెళ్లగానే హాలు, రెండు బెడ్‌రూంలు, పూజ, వంట, భోజనశాలతో మరో 4 గదులున్నాయి. పైఅంతస్థులోనూ విశాలమైన గదులను నిర్మించారు. నర్సింగారావు కుమారుడు తిరుపతిరావు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన భార్య ఉమాదేవి, కొడుకు మారుతిరావులు అక్కడే ఉం టున్నారు. తిరుపతిరావు రెండేళ్ల కిందట మృతిచెందారు. గత యేడాది ఆయన సంవత్సరీకం కార్యక్రమాన్ని స్వగ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. స్వగ్రామంలోని తాతల నాటి ఇంటిని మర్చిపోకూడదని మారుతిరావు ఇటీవల రూ.5 లక్షలు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టారు. 84 ఏళ్ల భవంతిని చూసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



భవనం కమాన్

ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హు లైన ఉమ్మడి జిల్లా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఫిబ్రవరి 9వ తేదీ వరకు వెబ్‌సైట్ cle. cgg. gov.inలో దరఖాస్తు చేసుకో వాల ని సూచించారు. ఈ నెల12 నుంచి 14 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 0878-2268686 నంబరులో గానీ, కరీంనగర్‌లోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కళారవళి సోసియో కల్చరల్ అసోసియేషన్, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో 15 గంటల చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం 33 జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వహణ బాధ్యులు కృపాదానం, విష్ణుదాస్ గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను విష్ణుదాస్ గోపాలరావు, ఇంటి నంబరు. 3-101/2, అహల్యానగర్, బోర్నపల్లి, హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని, వివరాలకు 94402 39793 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఎమ్మెల్సీ బరిలో బీఆర్‌ఎస్ లేనట్లే..

- పార్టీలో ప్రసన్న హరికృష్ణ చేరికకు బ్రేక్..
- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని అధినేత కేసీఆర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి బీఆర్‌ఎస్ తప్పుకున్నట్లు సమాచారం. ఎన్నికల హడావుడి ప్రారంభమైన నాటి నుంచి ఆ పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో ఎలాంటి సమావేశం నిర్వహించలేదు.. ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ శ్రేణులకు ఆదేశాలివ్వలేదు. దీంతో బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలపకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మూడు రోజుల క్రితం ఎన్నికల విషయంలో కదలిక వచ్చింది.

కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయ త్నించి భంగపడిన ప్రసన్న హరికృష్ణ బీఆర్‌ఎస్ నుం చి పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ అధినేత కేసీఆర్‌ను కలువడానికి ప్రయత్నించారని వార్తలు వచ్చాయి. కాదు పార్టీనే హరికృష్ణను పార్టీ అభ్యర్థిగా పోటీచేయమని ప్రతిపాదించి చర్చించిందని ప్రచారం జరిగింది. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఇంతకాలం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెబుతూ వస్తూ నాలుగు నెలలుగా ఓటరు నమోదు చేపట్టి పనిలో ప్రచారం కూడా నిర్వహించారు. ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ తర్వాతే హరికృష్ణకు అభ్యర్థిత్వం ప్రకటిస్తారని ప్రచారం జరిగింది.

బరిలోనే ఉంటానంటున్న సర్దార్ రవీందర్‌సింగ్

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనకు స్వస్తి చెప్పి స్థానిక ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలు వైఫల్యాలపై దృష్టి సారించి పార్టీశ్రేణుల్లో ఉత్తేజం నింపాలని ఆదేశించినట్లు సమాచారం. సోమవారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత బీఆర్‌ఎస్ శ్రేణులకు రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తానని అంటున్నారని, ఆయనకు మనం అండగా నిలుద్దామంటూ చెప్పడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. రవీందర్‌సింగ్ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటారని ఆమె చెప్పకనే చెప్పారు. దానికితోడు ప్రసన్నహరికృష్ణ బీఆర్‌ఎస్‌లో చేరే ఆలోచనను విరమించుకున్నారు. ఇండిపెండెంట్ గానే బరిలో ఉంటారంటూ ఆయన సన్నిహితులు ప్రచారంలో చేయడం కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థిని నిలపడం లేదనే అభిప్రాయానికి బలాన్ని చేకూర్చుతున్నది. బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పట్టభద్రుల స్థానంపై రవీందర్‌సింగ్‌తోపాటు ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరిలో శేఖర్‌రావు ముందుగానే పార్టీ ఏ విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాను ఇండిపెండెంట్‌గానే పోటీచేస్తానని ప్రకటించి, ప్రచారం చేసుకుంటున్నారు.

డాక్టర్ బీఎన్ రావు పార్టీ అభ్యర్థిని రంగంలో ఉంచని నేపథ్యంలో తాను పోటీ చేయబోనని చెప్పారు. రవీందర్‌సింగ్ మాత్రం ఇప్పటికీ తన ప్రచారాన్ని కొనసాగిస్తూ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పార్టీల నేతలతో తనకున్న సంబంధాల నేపథ్యంలో ఉద్యమకారులు, అన్ని పార్టీల్లోని మిత్రులు, అసంతృప్తివాదులు తనకు ఓటు వేస్తారని, స్థానిక అభ్యర్థిగా తాను ప్రధాన పోటీదారుగా ఉంటానని ఆయన చెబుతున్నారు. ఎమ్మెల్సీ కవిత మద్దతు ప్రకటించిన నేపథ్యంలో జాగృతి శ్రేణులు రవీందర్‌సింగ్‌కు ప్రచారం చేస్తున్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి

కరీంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేముల కరుణాకర్‌రెడ్డి (తీగల ధర్మారం, ధర్మపురి), పిడిశెట్టి రాజు (వెంకటేశ్వరపల్లి, కోహెడ), టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి (మంచిర్యాల) నామినేషన్లు వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు ఎనిమిది మంది, టీచర్ స్థానానికి నలుగురు మొత్తం 12 మంది 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను అడ్డుకోవాలంటే

ఇన్నారెడ్డిని ఆశీర్వదించండి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఇన్నారెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను అడ్డుకోవాలంటే తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డిని ఆశీర్వదించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, రవికుమార్‌తో కలిసి ఇన్నారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న యూపీఎస్ విధానాన్ని అడ్డుకోవడానికి సీపీస్ అభ్యర్థి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్నాడని తెలిపారు.

సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



ఎస్‌యూలో జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమర్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రాల మధ్య సమగ్ర సహకారం, సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్-2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్ మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీ కరణ తర్వాత భారత్ విద్యారంగంలో విజయవంతమైందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ దేశం ఇంకా అనేక రంగాల్లో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధిలోముందుకెళ్తోందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకు లపతి ప్రొఫెసర్ సాయన్న మాట్లాడుతూ భారత్ పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ దేశం పారిశ్రామిక, సేవా రంగాలలో త్వరిత గతిన వృద్ధి సాధించినా వ్యవసాయ రంగం లో విప్లవాత్మకమైన మార్పులు రావాలని, అప్పుడే గ్రామీణ భారత్ అభివృద్ధి చెందుతుం దని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్. సూరేపల్లి సుజాత, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు శ్రీవాణి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, యూజీసీ అఫైర్స్, ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



అభిరామ్



ప్రేమ్

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో 11స్టాగ్ తెలంగాణ స్టేట్ అండ్ ఇంటర్ డిస్ట్రిక్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో జగిత్యాలకు చెందిన బొడిగె అభిరామ్, అలిశెట్టి ప్రేమ్‌లు అండర్-15 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ పొడేటి శ్రీకాంత్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్నాయన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమేట అశోక్ అభినందించారు.

బోనమో నమః

- బద్ది పోచమ్మకు బోనాల జాతర
- ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించిన భక్తులు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి అనుబంధ శ్రీబద్దిపోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది.. బద్దిపోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం అమ్మవారికి బోనం తీసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

తెల్లవారు జామునే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మండపంలో అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం నైవేద్యాన్ని పెట్టి శ్రీబద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని, కల్లు సాక పెడుతూ పిల్లపాపలు, పాడి పంటలు చల్లగా ఉండాలని, మళ్లీ వచ్చే యేడుకు తిరిగి వచ్చి మరింత ఘనంగా జాతర నిర్వహించు కుంటా మని మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసి పోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. క్యూలైన్లు త్వరగా కదిలేందుకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జీ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కాగా బద్ది పోచమ్మ ఆలయం ఎదుట బలిచ్చే జీవాలకు కల్లు సాక పెట్టేందుకు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

గల్ఫ్ బాధితులకు ఆపన్నహస్తం



దుబాయిలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు

- దుబాయిలో ఇక్కట్లు పడుతున్న వారికి అండగా యువకులు
- గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు
- 300మంది వలంటీర్లు స్వచ్ఛంద సేవ

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి వెళ్లి అక్కడ అనుకోని ఆపదలో చిక్కుకున్న అభాగ్యులకు గల్ఫ్ కార్మి కుల రక్షణ సమితి అనే స్వచ్ఛంద సంస్థ అండ గా నిలుస్తోంది. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన ఆరే శేఖర్ అనే యువకుడు 15 ఏళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. మొదటి నుంచి సేవా గుణం కలిగిన శేఖర్ 2015లో గుండల్లి నర్సింహ అనే యువకుడితో కలిసి స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. 300 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

దుబాయిలో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కార్మికులను, అనారోగ్య బాధితు లను ఆదుకుంటున్నారు. చనిపోయిన వారి మృతదేహాలు స్వస్థలాలకు పంపించడంలో జాప్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. దుబాయి ఆమ్నెస్టీతో పాస్ పోర్టులు లేక చాలా మంది విమాన టికెట్లు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేసిన శేఖర్ తన పాత పరిచయాలతో తెలుగు వారిని స్వగ్రామాలకు రప్పించడానికి మిత్రుడు శ్రీధర్ గౌడ్ ద్వారా 560మందికి విమాన టికెట్లు సమకూర్చి ఇళ్లకు పంపించారు. మిత్రుల ద్వారా కొంత మేర డబ్బు ప్రోగు చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వేలాది మందికి అండగా..

స్వచ్ఛంద సంస్థ ప్రారంభించినప్పటి నుంచి పదివేల మందికి పైగా దుబాయి బాధితులకు అండగా నిలిచారు. కంపెనీల్లో జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు వేల మందిని ఆదుకున్నారు. ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు తదితర కారణాలతో మృతి చెందిన సుమారు వెయ్యికి పైగా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. అనారోగ్యంతో ఆసుపత్రిల్లో చేరి బిల్లు కట్టలేని వారి గురించి కాన్సులేట్ అధికారులతో మాట్లాడి ఇప్పటి వరకు రూ.5కోట్ల వరకు మాఫీ చేయించడానికి కృషి చేశారు.

స్వస్థలాలకు పంపిం చని మృతదేహాలకు దుబాయిలోనే వీరు అంత్యక్రియలు నిర్వహిస్తారు. కంపెనీ నుంచి బయటకు వచ్చి తిండి కోసం ఇబ్బందులు పడుతున్న వారికి భోజన వసతితో పాటు ఆశ్రయం కల్పిస్తారు. జీతాలు ఇవ్వని కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిం చడంతో పాటు తెలియక చేసిన నేరాలకు జైలు శిక్ష అనుభవిస్తున్న కార్మికులను జైలు నుంచి విడిపించి ఇళ్లకు పంపించేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. దుబాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ యువకులు అందరి మన్ననలు పొందుతున్నారు.

సమాచారం అందిస్తే చాలు

గుండల్లి నర్సింహ, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు



దుబాయిలో ఇబ్బందులు పడుతున్న వారికి మా వంతుగా సేవలు అందిస్తున్నాం. ఇబ్బందులు ఉన్న వారు మాకు సమాచారం అందిస్తే వారికి అండగా నిలుస్తాం. ఇప్పటికే వేల మందికి మా స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందించాం. ఇందులో మా మిత్రులు, దుబాయి అధికారుల సహకారం మరువలేనిది. భవిష్యత్తులో మా సేవలను మరింతగా విస్తృతం చేస్తాం.

సేవలతో మానసిక సంతృప్తి

ఆరె శేఖర్, ఉపాధ్యక్షుడు



దుబాయి వెళ్లకముందు మా గ్రామంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. అక్కడికి వెళ్లిన తరువాత తెలుగువాళ్లు ఎదుర్కొంటున్న కష్టాలు చూసి మనసు చలించింది. దీంతో మిత్రులతో కలిసి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాం. అనేక మంది తమ సమస్యలను మా దృష్టికి తేవడంతో అక్కడికి వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సామాజిక సేవతో మానసిక సంతృప్తి కలుగుతుంది.



దుబాయిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువకులు,



కూలీలకు అందజేసేందుకు సిద్ధం చేసిన బియ్యం

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

‘మత్తు’లో యువత

(5వ పేజీ తరువాయి)

పడుతున్నట్లు తెలుసుస్తోంది. గంజాయి విరివిగా దొరుకుతుండడంతో యువతలో వినియోగించడం పెరిగి పోయింది.

● ఉత్తరాది కార్మికుల ద్వారా జిల్లాకు గంజాయి

గంజాయి స్మగ్లర్లు తమ వ్యాపారాన్ని కరీంనగర్‌లో విస్తరించేందుకు ఉత్తరాది నుంచి వచ్చే కార్మికులను ఏజెంట్లుగా మార్చుకున్నారు. స్థానికులు ఏజెంట్లుగా ఉంటే ఎవరికైనా అనుమానం వస్తుందని భావించిన మాఫియా ఒడిసాకు చెందిన వారినే ఏజెంట్లుగా చేసి గంజాయి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నది. కొన్నేళ్ల క్రితం గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా యువకులు, విద్యార్థులకు సరఫరా చేస్తున్న ఒక ముఠా ఎవరికీ అనుమానం రాకుండా ఎలగందుల శివారులోని చింతచెట్టుపై మంచెలో ఒక స్థావరాన్ని ఏర్పాటు చేసింది. మంచె లోపల అన్ని సౌకర్యాలు కల్పించింది. ఆ మంచెలో కూర్చుని ఒక సిగరెట్ ద్వారా గంజాయి తాగడానికి చార్జి విధించేవారు. పోలీసులు పట్టుకుని నిర్వాహకులను కటకటాల్లోకి పంపించారు. కొన్నాళ్ల క్రితం కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో ఇంటర్‌మీడియట్ చదువుతున్న గ్రామీణప్రాంతానికి చెందిన ఐదుగురు బాలురు అద్దె గదిలో గంజాయిని హుక్కా ద్వారా సేవిస్తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు. అంతకుముందు బొమ్మకల్‌లో 10 మంది బాలురు హుక్కాతో గంజాయిని సేవిస్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ రెండు ఘటనల్లో తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రేపు నగరంలో మంచినీటి సరఫరాకు అంతరాయం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫిల్టర్ బెడ్‌లలో రా వాటర్ మేయిన్ పైపులైన్ వాల్వ్ మరమ్మతు చేస్తున్నందున గురువారం నగరంలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

ఫండస్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసంలో కరస్పాండెంట్, డైరెక్టర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కాశ్మీరగడ్డలోని ఫండస్ స్కూల్లో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంతకుముందు సరస్వతీపూజ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్ల అందజేశారు. కరస్పాండెంట్ గోపు పద్మజా ప్రభాకరరెడ్డి, డైరెక్టర్ గోపు సుశాంక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్నేహారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్ర వరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా రథసప్తమి పండుగను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సూర్య నమస్కారాలు, నదీస్నానాలు, అర్ఘ్యాలు, ఆలయాల సందర్శనలు, ఉపవాసాలు పాటిస్తూ వ్రతాలాచరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన యూనివర్సిటీలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. మంగళవారం తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2009లో తెలుగు, ఇంగ్లీష్, 2013లో బాటనీ, మ్యాథమెటిక్స్ కోర్సులను అప్పటి ఎండీసీ రెగ్యులర్ కోర్సులుగా ప్రవేశపెట్టారని, 2022 జూన్‌లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అంజన్న తదితరులు ఉన్నారు.

హరిహర క్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని హరిహరక్షేత్రం వేంకటేశ్వర, శివ, అయ్యప్ప, ఆంజనేయ స్వామి ఆలయ సముదాయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ అనిల్‌కుమార్, ఈవో కాంతారెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన నెమలి.. డీర్‌పార్క్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలో రైతు పొలంలో అనారోగ్యంతో కదలకుండా పడి ఉన్న నెమలి కనిపించింది.దీంతో రైతు బొమ్మకల్‌లోని శ్రీలక్ష్మి జంతుసంరక్షణ శాల నిర్వాహకుడు అసిరి సుమన్‌కుమార్‌కు సమాచారం అందించాడు. వెంటనే సుమన్ నెమలిని కరీంనగర్ పశువైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం కరీంనగర్ డీర్‌పార్క్‌లో అప్పగించారు.

చికిత్సతో ప్రాణనష్టాన్ని తగ్గించుకోవచ్చు



కార్యక్రమాల్లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహాత్‌బాజ్‌పాయ్, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల చైర్మన్ లక్ష్మీనరసింహారావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌కు చికిత్సతో ప్రాణనష్టాన్ని తగ్గించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తించి చికిత్స చేసుకోవడం ద్వారా వ్యాధి నుంచి బయటపడే అవకాశముందన్నారు. పీవో ఎంహెచ్ఎన్ సనా జువేరియా, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ తాత్వికా, డాక్టర్ ఎనుమల్ల శ్రీదేవి, మానస, స్వప్న, విజయ లక్ష్మి, తులసి, శేష శైలజ, డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: ముందస్తుగా గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేయవచ్చని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల చైర్మన్ లక్ష్మీ నరసింహరావు అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ కేన్సర్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన లేకనే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది మృత్యువాత పడుతున్నారన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అసీం అలీ, సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ప్రసాద్, కేన్సర్ ఆస్పత్రి హెచ్ఓడీ డాక్టర్ ఎజిలారాసి పాల్గొన్నారు.

● నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, సూక్ష్మ జీవ శాస్త్ర విద్యార్థినులు మంగళవారం కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు.

● అవీ.. ఇవీ

సుభాష్‌నగర్: నిరుద్యోగుల పక్షాన పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు ఉచితంగా న్యాయ సేవలు అందించినట్లు చెప్పారు.

● బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులతోనే ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్‌భవన్‌లో విలేక రులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థి మల్క కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ చిన్నమైల్ అంజి రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా వేముల కరుణాకర్‌రెడ్డి మంగళవారం నామి నేషన్ దాఖలు చేశారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (ఎస్జీటీయూ) రాష్ట్రశాఖ అభ్యర్థిగా సంకినేని మధుసూదన్‌రావును పోటీకి నిలుపుతున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు.

భగత్‌నగర్: ఉపాధిహామీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు.

కరీంనగర్ కల్చరల్: మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కరీంనగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సారె సమర్పించనున్నట్లు సంఘం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

● వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా శంకరపురంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే రెండో సాహిత్య సాంస్కృతిక మహాసభలకు రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌కు ఆహ్వానం అందింది.

● తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, కవి వట్టికోట ఆళ్వార్‌స్వామి సాహిత్యంపై బుధవారం భగత్‌నగర్ మారుతి హెవెన్స్‌లో ముచ్చట ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతాన్ని 74 నుంచి 100 శాతానికి పెంచే బీమా చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి వామన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ ఈ నెల 1న ప్రవేశ పెట్టిన బీమా చట్ట సరవణ బిల్లు-2024ను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివిజన్ సంయుక్త కార్యదర్శి బసవేశ్వర్, డివిజనల్ అధ్యక్షుడు రాంమోహన్ రావు, నాయకులు శ్రీలత, అనుపమ, మహేశ్, ఆనందం, శ్రీదేవి, మల్లేశం పాల్గొన్నారు.

సమ్మెకు సమాయత్తంకండి

- ఆర్టీసీ కరీంనగర్ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9 నుంచి చేపట్టనున్న సమ్మెకు కార్మికులు సమాయత్తం కావాలని టీజే ఆర్టీసీ కరీంనగర్ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ సమ్మెకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, ఇతర సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):కేంద్రం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ చౌరస్తాలో చేతిలో చిప్ప చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎంపీ, బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉన్నా జిల్లాకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్, కరీంనగర్-కాజీపేట రైల్వే లైన్ల ఊసే లేదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు పాల్గన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో బుధవారం నుంచి బంగారు పోచమ్మ, బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠాప నోత్సవాలు ప్రారంభం కానున్నాయి. గ్రామంలోని పోచమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరడంతో స్థానికులు నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ కొరుకంటి వేణుమాధవరావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి 10వ తేదీ వరకు పోచమ్మ విగ్రహంతోపాటు భూలక్ష్మీ, శ్రీలక్ష్మీ సహిత బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని హస్పిటల్ టీయూసీసీ జాతీయ కమిటీ సభ్యులు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ కోరారు. మంగళవారం డీఎంఈకి వినతిపత్రం అందజేశారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీగార్డులకు చెందిన కార్మికుల నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వైద్యాధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే కార్మికులకు సకాలంలో జీతాలు రావడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.అరుణ్, ఎస్.రాజు, ఎ.నరేష్, ఆర్.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం, హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివ రించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్యామల, డాక్టర్ మాదవి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజ్‌కుమార్, మమత, రమేష్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, రుక్సీరాణి, స్వరూపరాణి, ఓదెలు, సుమలత, నరేందర్, మంగమ్మ, రేణుక, మహిపాల్‌రెడ్డి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మక విజయం


సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణన చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రాత్మక విజయమని ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్య క్షుడు పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. మంగళ వారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో నివేదికను ప్రవేశపెట్టడంపై నగరంలోని ఇందిరా చౌక్ వద్ద సంబరాలు నిర్వాహించారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులకు, ప్రభుత్వానికి బీసీల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తాజ్, రహమత్ హుస్సేన్ పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: కులగణన, సమగ్ర కుటుంబ సర్వే నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

హుజూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని పలు హోటళ్లపై మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని మూడు హోటళ్లపై రూ.2500 జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అధికారులు ఎండీ రషీద్, శ్రీకాంత్, అశ్వినీగాంధీ, కిషన్‌రావు, వినయ్, సుధీర్, రమేష్, అనిల్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

● జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న


చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం అన్నారు. మంగళవారం వ్యవసా య మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ అధికారులు, ఖరీద్‌దారుడుల, అడ్తిదారులతో చైర్‌పర్సన్ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లను పరిశీలించారు. హుజూరాబాద్ రోడ్డులోని మార్కెట్ చెక్‌పోస్ట్‌లో రికార్డులు తనిఖీ చేశారు. కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు.

మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు శంకర్, మల్లేశం, మమత తదితరులు పాల్గొన్నారు.

● సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి భౌతిక శాస్త్రం పోటీలలో సోమారం మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బండారి సంపత్‌కుమార్ తెలిపారు.

● గంగాధర: విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ఎంఈవో ప్రభాకర్‌రావు అన్నారు. బూరుగుపల్లిలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

● చిగురుమామిడి: ఇందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ జయప్రద, ఉపాధ్యాయుడు ఓదెలు కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మెరుగైన ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకుంటే అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం డెల్వీ-టీవీఎస్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ బ్రాంచ్‌లకు చెందిన 116 మంది విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం


హుజూరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన ఏ ఒక్కరికీ అందించలేదని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణ శివారులోని గణేష్‌నగర్‌లో గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ వందల కోట్లు ఖర్చు చేసి కట్టించిన ఇళ్లను పేదవారికి అందించని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్‌రెడ్డి కూడా ఏనాడూ నిరుపేదల గురించి పట్టించుకోలేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు హుజూరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసిందన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ జమ్మికుంట, ఉప్పల్ రైల్వే స్టేషన్లకు నిధులు కేటాయించడంలో విఫలమయ్యారన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఫిబ్రవరి 04 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సర్వే నెంబర్ 464లో గల నాలుగో ప్లాట్‌ను తాము చట్టబద్ధంగా కొనుగోలు చేశామని, కొంత మంది నకిలీ పేపర్లు సృష్టించి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎండి ఆరీఫ్ పోలీస్‌లను ఆశ్రయించాడు. నకిలీ పేపర్లు సృష్టించి తమ పట్టా భూమిలోకి చొరబడ్డారని, వారికి కొందరు సహకరిస్తూ తమను బెదిరింపులకు గురిచేస్తున్నార న్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

రెండో రోజుకు చేరిన రిలే దీక్ష

జమ్మికుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్ సమీపంలో గల తమ పట్టా భూమిలో మొరం పోసి కబ్జా చేసేందుకు ఓ మాజీ పోలీస్ అధికారి ప్రయత్నించారని బాధిత కుటుంబం చేపట్టిన రిలే దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. వారికి మద్దతుగా నిలిచిన షేక్ సాబీర్ అలీ, అంబాల రాజు మాట్లాడుతూ కాటిపల్లి లక్ష్మికి చెందిన పట్టా భూమిని వారికి అప్పగించి వారికి పూర్తి స్థాయి న్యాయం చేయాలన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

గంగాధర, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్ సూర్య దేవాలయంలో మంగళవారం ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

● చిగురుమామిడి: సుందరగిరి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషం నవీనాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


హుజూరాబాద్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ స్థితిగతినే మారుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రావుల వేణు, గంగిశెట్టి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, సుమన్, శ్రీనివాస్, రాజశేఖర్, రాజు, రమేష్, సంజీవరెడ్డి, సంజీవ్, సారయ్య, నగేష్, కిరణ్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, నాయకులు అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, జైపాల్, నరేందర్, అశోక్, వెంకటలక్ష్మి, వీరార్జున్, శివారెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లందకుంట : మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, రాంబాబు, రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శంకర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మండల శాఖ ఆధ్వ ర్యంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందన్నారు. నాయకులు దూడెం శ్రీనివాస్, మోతె శ్రీనివాస్ రెడ్డి, ఆవుల సునీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: కొత్తపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ కొత్తపల్లి జోన్ అధ్యక్షుడు ముత్తునూరి హరీష్ రావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేటాయింపులన్నీ వికసిత్ భారత్ లక్ష్యంగానే ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్, మాజీ జిల్లా జనరల్ సెక్రెటరీ వాసుదేవరెడ్డి, రాష్ట్ర దళిత మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఉన్నారు.

సంక్షిప్తం

● ఇల్లందకుంట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్పర్శ లెప్రసీ ప్రోగ్రాంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

●వీణవంక: మండలంలోని నర్సింహుల పల్లి గ్రామానికి చెందిన వంతడుపుల అజయ్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ సభ్యులు 50 కిలోల బియ్యం అందించారు.

● చిగురుమామిడి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో బాస మధుసూదన్ అధ్యక్షతన ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు.

● రామడుగు: మండలంలోని కొక్కెర కుంట గ్రామంలోని బీరప్ప దేవాలయాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కురుమ సంఘం అధ్యక్షుడు కడారి వీరయ్య డిమాండ్ చేశారు.

●రామడుగు: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి రెండోసారి నియామకం కాగా మంగళవారం వివిధ మండలాల మహిళా నాయకులు కలసి అభినందనలు తెలిపారు. శంకరపట్నం మండలాధ్యక్షురాలు చింతిరెడ్డి పద్మ, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు కవ్వ పద్మ, మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు పాకాల వందన ఉన్నారు.

● హుజూరాబాద్ రూరల్: మంత్రిగా ఈటల రాజేందర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ జరిగేలా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ డిమాండ్ చేశారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని స్మశాన వాటిక బోర్ మోటర్ ఆరు నెలలుగా పనిచేయడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. స్మశాన వాటిక వద్ద స్నానాలు చేయడం కోసం ప్రైవేట్ ట్యాంకర్లను తెప్పించుకోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా వెంటనే బోర్ మోటర్‌ను మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.